# అర్థంకాని హృదయం

రచన: శ్రీ ఎ. వెంకటబలరాం.

(గతసంచిక తరువాయి)

"బాగుంది అందులో "జిందగి ఇక్ సఫర్ హై సుహానా, యహా కల్ క్యా హో కిస్ నే జానా' అన్న పాట చాలా నచ్చింది".

"అవును ఈ జీవితము మదురాతి నావలాంటిది, రేపు అది ఎప్పుడు ఏమి అవుతుందో తెలియదు" అని ఆ పాటకు తెలుగులో అర్థము చెబుతూ, "ఆ సాంగ్ చాలా బాగుంది" అన్నాను.

ఇంతలో...టూ టౌన్ జంక్షన్ వచ్చింది. భారతి రామారావు పేటలోవున్న వాళ్ళింటికి, నేను హాస్టల్‌కు రిక్షాలు బేరమాడుకొని వెళ్ళిపోయాము. ఆ రోజు శనివారము కావటము వలన హాస్టల్‌కు వచ్చేసరికి మెస్ ఇంకా తెరిచి వుంది. భోజనము చేసి నా గది వెళ్ళాను. ప్రతి రోజు పడుకునే ముందు దేవునికి నమస్కరించే అలవాటుండడంవలన, దేముని పటము దగ్గరకు వెళ్ళేను. ఆ రోజు పటములో దేముడెందుకో కోపముగా వున్నట్లు కన్పించేడు. ఎందుకిలా కన్పించేడా దేవుడని ఆలోచిస్తుండగా గుర్తు వచ్చింది. నేను ఫస్ట్ ఇయర్ ఆనాటమీ ఫిజియాలజీ పాసయితే అన్నవరము సత్యనారాయణ స్వామి గుడికి వస్తానని మొక్కుకున్నాను. అదింతవరకు తీర్చనే లేదు.

"ఎవరన్నా నవ్వగలరు నీ మొక్కులు విని. నీవెప్పుడు దేముడు కన్పించినట్లుగా మాట్లాడతావు కదా, నాకొక్కసారి కనబడమను. అసలు దేముడున్నది, లేనిది తేల్చేస్తాను" కాస్త తీక్షణముగానే అన్నాడు పరమేశ్.

"మధ్యలో మాట్లాడవద్దని తీర్మానించుకున్నాక మళ్ళీ మధ్యలో సందేహాలేమిటిరా. నీకు దేముడంటే నమ్మకము లేకపోతే మరెవ్వరికి వుండకూడదనా? నిజంగా నా దేముడు నాతో మాట్లాడుతాడు. ప్రత్యక్షముగా కాకపోయినా పరోక్షముగానైన నా దైవము నా మనసుకు సాక్షాత్కరిస్తుంది. అది భయమును, భక్తిను, నేను చేసే ప్రతి పనిలో మనస్సున జేరి తీర్చిదిద్దే నా శక్తి" అన్నాను.

"అది ఒట్టి నీ చేవస్తము" అని ఊరుకున్నాడు.

ఏమయినా నేను నిలా నాస్తికుడను కాను. ఆ మరుసటి రోజు ఆదివారము రావడంవలన తప్పక ఆదివారము నాడు వ్రతము చేసుకుంటానని సంకల్పించుకొని దేమునికి నమస్కరించుకొన్నాను. కాస్త, మనస్సు తేలికపడింది. ప్రక్కపై మేనువాల్చాను. నిద్ర రావటములేదు కాని భారతి మాత్రము గుర్తుకి వస్తుంది. ఆ రాత్రంతా భారతిని వివాహము చేసుకొని తీయటి లోకములో తేలియాడి పోతున్నట్లు కలలు గన్నాను.

• • •

నేను నిద్ర లేచేసరికి ఐదు గంట లయింది. అర గంటలో కాలకృత్యములు తీర్చుకొని తలంటు స్నానము చేసి తయారయ్యాను. చిన్న బాగ్ లో పంచి, తువ్వాలు వేసుకొని నా రూమ్ మేట్ ని లేపి అన్నవరం వెళదామన్నాను. 'సారీ' ఇవ్వాళ రాలేనన్నాడు. ఇంక లేపి లాభం లేదని నేనొక్కడినే బయలుదేరాను. అన్నవరం పోయే బస్సులు మా కాలేజిమీదుగా పోవాలి. అందుకే హాస్టలునుండి నడిచి కాలేజ ఇన్ గేటు దగ్గరగానున్న కిళ్ళీబట్టి దగ్గర నిలబడ్డాను. నేను నిలబడిన అరగంటకు అన్నవరం బస్సు రివ్వున దూసుకుంటూ వచ్చి అక్కడ ఆగింది. బస్సు కాస్త ఖాళీగానే వుంది. ముందుకుపోయి రెండోసీటులో కిటికీకి దగ్గరగ కూర్చున్నాను. బస్సు మళ్ళీ కదిలింది. అప్పుడే తెల్లవారుతున్న ఆ ప్రకృతి దృశ్యాలను చూస్తు బస్సు చాలా వేగంగా పరిగెడుతున్నాయి. వాతావరణం చల్లగానుండి, చల్లగాలి వీస్తుండగ అప్పుడే పొలాల పనుల్లోనికి ఉపక్రమిస్తున్న రైతులను, పనివాళ్ళను చూస్తున్న నాకు చాలా ఆహ్లాదకరంగా వుంది. ఇటువంటప్పుడు భారతి నా ప్రక్కనవుంటే ఎంత బాగుండును. పచ్చగా ఏపుగా పెరిగిన పంట పొలాలలో చెట్టాపట్టాలు పట్టుకొని డ్యూయెట్ సాంగ్స్ పాడుకుంటు ఈ బాహ్య ప్రపంచానికి సంబంధం లేకుండా యుగ మొక క్షణంగా గడుపుతూ ఒకరితో ఒకరు లీనమై పోయేవాళ్ళం.

• • •

మాకు పెళ్ళయితే...సిగ్గుపడుతున్న భారతి, వెనగా వచ్చి "అబ్బో! పెళ్ళయిన ఈ శ్రీమతికి ఇంత సిగ్గయితే ఎలాగండి" అంటూ బుగ్గమీద చిన్నగా గిల్లేను.

"అబ్బ! ఏమిటండి మీ చిలిపితనము మరీ ఎక్కువయి పోతుంది. ఎవరన్నా చూస్తే!"

"చూడనీ..." అంటూ మరింత దగ్గరిగా లాక్కున్నాను.

"అబ్బ! ఆశ...ఇంక చాలులెండి మీ చిలిపిచేష్టలు, భోజనానికి రండి. ఆకలి వేయటము లేదేమిటి", అంటూ డైనింగ్ హాలులోకి నడిచిపోయింది.

"నువ్వు నా దగ్గర వున్నంతసేపు ఒక్క భోజనమే ఏమిటి భారతి నన్ను నేనే మరచిపోతున్నాను. అంతటి శక్తివుంది. మరి నీ అందములో".

"రాజావారికి, అన్నము వడ్డించిన, తినకుండా కూర్చోవడములో అంతరార్థ మేమిటో?"

"రాణిగారు చిట్టి చిట్టి గోరుముద్దలు చేసి తినిపిస్తారని, రాజావారి ఆశ. ఏది త్వరగా రాజావారి ఆశ తీర్చవు?"

"అబ్బ! ఏమిటండి వేలు కొరికేసేరు. మీరు మరీ రోజు రోజుకి క్రొత్త పెళ్ళికొడుకయి పోతున్నారు.'

అంతలోనే నవ్వు, ఆ నవ్వులో వేయివీణల మాధుర్యము.

"త్వరగా తయారవ్వు, భారతి సినిమాకి టైమయిపోయింది."

"అబ్బ, ఇప్పుడు సెకండ్ షోకి ఎందుకండి. తరుచుగా వెళ్ళితే కళ్లు పాడయిపోగలవు."

"ఈ వయసులో వెళ్ళకపోతే తాత, మామలమయ్యాక వెళ్దామేమిటి, సినిమాలకి కమ్ క్విక్."

"సినిమా చాలా బాగుందండి. జయభాధురి నాకు నచ్చింది."

"నాకు నా భార్య నచ్చింది."

"చీ! పోండి. మీరు బట్టలు మార్చుకుంటుండండి. నేను గ్లాసులో పాలు తీసుకొస్తాను..."

"ఈ సగము పాలు నీవ..."

"హు హుం..."

"ఇంక పడుకోండి."

టక్ టక్ టక్

"ఏమిటా శబ్దము భారతి?"

"ఎవరో తలుపు కొడుతున్నారండి."

"ఇప్పుడెవరు కొడతారు తలుపు?"

"ఇంకెవరు, మన పేషంట్లే. అర్జంటు కేసయి వుంటుంది. ఉండండి తలుపు తీసి, కనుకుంటాను".

"బావుంది నీ వరస. కొంతసేపు నీ మురిపింపుతో మరి కొంతసేపు ఈ పేషంట్లతో తెల్లవారిపోతుంది.

బ్రేక్...బస్సు ఆగింది...ప్రక్కకు తిరిగి చూసేను.

"పిఠాపురము పంచాయితి" అనే బోర్డు కనిపించింది. ఓహో అప్పుడే పిఠాపురము వచ్చేసిందన్న మాట. చీచీ, దేముడి గుడికి వెళుతూ ఏమిటి పాడు ఆలోచన ఊరకనే వుంటే ఇలానే బుర్ర పనిచేస్తుంది. ఇంక లాభంలేదు, నా ఆలోచనలను డైవర్ట్ చేయాలని అప్పుడే బస్సు ప్రక్కగా వచ్చి ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక అంటూ అరుస్తున్న పేపరు బాయ్ ని పిలిచి ఒక పేపరు తీసుకున్నాను. బస్సు కదిలింది.

సీరియస్ గా పేపరు చదవడము మొదలుపెట్టేను. మరెటువంటి ఆలోచన చేయక.

నిన్న రాత్రి హౌరా ఎక్స్ ప్రెస్, ఒక గూడ్సుబండిని ఢీకొన్నందువల్ల నలుగురు మృతి, నలభై మందికి గాయాలు.

కలకత్తాలో జరుగుతున్న ఉద్యమములోని ముఖ్య కార్యకర్తల ఎరెస్టు.

ఒకరోజు ఢిల్లీలో...బాబు పేపరు కాస్త క్రిందికి దించి చదువుకోనాయనా. ముందుసీటులోనుండి వెనక్కు తిరిగి ఎగిరెగిరి పడుతూ ముందు పేజీలో హెడ్ లైన్స్ చదవ ప్రయత్నిస్తున్న ఒక ముసలి ప్రయాణికుని అభ్యర్థన. నిశితముగా అతనివైపు చూసాను. వయస్సు ఏభై పైన ఉంటుంది. బడిపంతులులాగ వున్నారు. ఈ కాలములో ఈ గవర్నమెంటు ఇచ్చే చాలీచాలని జీతాలలో సంసారాన్ని ఈదలేక క్రిందమీద పడుతున్న బడిపంతులకు రోజు పేపరు కొనే స్తోమత ఎక్కడుంటుంది. తమ కుటుంబాలలో రోజు రోజుకి కలతలు పెరిగి హృదయాన్ని క్షోభిస్తూన్నా భారత పౌరునిగా దేశములోని విశేషాలు తెలుసుకోవాలన్న ఉత్సాకత చూపే వీరిని చూసి జాలిపడకుండా ఎవరుండగలరు? పేపరు ఇద్దరము చదవగలిగేటట్టుగ త్రిప్పి చదువుకున్నాను.

ఈరోజు రెండు బస్సులు "ఢీ" కొనుటవలన ప్రయాణీకులకు గాయాలు.

కాస్త ఇలా పెట్టి చదువుకోకూడదు నాయనా, మళ్ళీ ఆ ముసలి ప్రయాణీకుని సణుగుడు.

"ఇదండి మాష్టారు ఈ పై పేపరు మీరు చదువుతుండండి. ఈలోపల మధ్య పేపరు చదివిస్తాను" అ సాగుడునుంచి బయట పడేందుకు పై పేజి మాష్టారుగారికిచ్చి తాపీగా గాలి ధాటుకు తట్టుకోలేకపోతున్న మధ్య పేజీలు గట్టిగ పట్టుకొని చదువుతున్నాను.

"కాస్త స్లో...కాస్త స్లోగా......పోనీయరయ్యా. ఎందుకంత స్పీడు. సందుగొందుల్లో కూడా" కండక్టరు హెచ్చరిక.

అప్పుడు గమనించేను. డ్రైవరు సీటు ప్రక్క కాస్త ముందుకి వంగి "స్పీడో మీటరుని" అరవై, డబ్బైకిలో మీటర్ల మధ్యన తోక ఊపుతుంది ఎర్రటి ముల్లు. నాకు మాత్రము సరదాగా వుంది. అంత స్పీడుగా బస్సు వెళుతుంటే "ఎందుకయ్యా, కండక్టరు డ్రైవరుని కసురుకుంటావు, ఎంత స్పీడుగా వెళితే అంత వేగంగా గమ్య

స్థానము చేరుకోవచ్చుగా. త్వరగా అన్నవరం చేరి తిరుగు ప్రయాణం త్వరగానే అవుతుంది" అని మనసులో అనుకున్నాను.

మళ్ళీ బస్సు ఆగింది..."గొల్లప్రోలు".

మళ్ళీ కొంతమంది మనుష్యులు ఎక్కారు. ఇప్పుడు బస్సంతా నిండింది, నా ప్రక్కన, మరోచోట, ఖాళీ తప్పించి. బస్సు కదిలింది. త్వరలోనే స్పీడు అందుకొంది. నాలో సంతోషము ఎక్కువయింది. అనుకొన్న టైము కన్న ముందుగా కొండను చేరుకోబోతున్నానని.

బస్సు అతి వేగంగా పోతున్నా బస్సులోని ప్రయాణికులు మాత్రం నిశ్శబ్దంగా వున్నారు. చదువుకొంటున్న వాళ్లు చదువుకుంటున్నారు. కొందరు కిటికీ గుండా దృశ్యాలు చూస్తున్నారు. కొందరు తల్లులు పిల్లలకు పాలు పట్టుటలో నిమగ్నమై యున్నారు. మరికొందరు ఆలోచనాపరులై యున్నారు. అందరి కన్నా కొందరు ఈ బాహ్యప్రపంచంతో పనిలేనట్లు కునికిపాట్లు పడుతున్నారు. నేను మళ్ళీ పేపరులో తలదూర్చాను.

ఇంతలో వినిపించింది, కీచుమన్న శబ్దము. ఒక్కసారిగ ముందుకి వంగాను. అలా వంగుతూనే పేపరును వదలి కుడిచేతిని ముందు సీటు పైనున్న రాడ్ పై వేసి డ్రైవరు సీటువైపు చూసాను. డ్రైవరు స్టీరింగు వదులుతూ కాస్త ప్రక్కకు జరిగి క్రిందకు జారిపోతున్నాడు. బస్ రోడ్డు దిగిపోతుంది. ఎడమప్రక్కగ వాలిపోతుంది. అంతలో మైలురాయిని ఢీకొంది. బస్సులో ప్రయాణికులంతా ఒక్కసారిగ ముందుకురికారు. నేను కుడిచేతితో మరింత గట్టిగ రాడ్ ను పట్టుకొన్నాను. బస్సు ఆగలేదు. మైలురాయిపైనుండి వెళ్ళి మరింత ఒరుగుతూపోతూ ముందుకు పోయింది. ఎదురుగా అడ్డముగుండా ఒక చెట్టు మాత్రము కనిపించింది నాకు. తర్వాత పెద్ద శబ్దం వినిపించింది. "అమ్మా" అని అరుస్తూ ముందు కొరిగి పోయాను.

కళ్లు తెరిచేసరికి పరిసర వస్తువులనుబట్టి పరిచయమున్న గదిలో వున్నట్టయ్యింది. తరువాత గ్రహించాను. కాకినాడ జనరల్ హాస్పిటల్ గదని. నా దగ్గరకు అసిస్టెంట్ సర్జన్ వచ్చి మీరు ఈ కాలేజి స్టూడెంటే కదూ అన్నారు. ఎంతో ఆప్యాయతతో. అవునన్నట్లు తలూపాను. మీరు చాలా అదృష్టవంతులు. ప్రాణాపాయమేమి లేదు. మీ గడ్డందగ్గర మూడు అంగుళాల వరకు కోసుకున్నది. దానికి కుట్లు వేసాను. మీ కుడికాలి మోకాలుకు చిన్న ఇనుప ముక్క గ్రుచ్చుకుంది. నీరు తీసి కట్టు కట్టానన్నారు. నా ఎడమ కంటినుండి నీరు కారనారంభించింది. అది నేను ఏడ్వటంవలన కాదు. ఏదో దెబ్బ తగిలి వుంటుందని అనుకున్నాను. కాని ఆయన నేను బాధ పడతున్నాననుకొని బాధపడకండి. త్వరలోనే నయమైపోతుందంటూ ఇంజక్షన్స్ యిచ్చి, మందులు వ్రాసి "నాతో" మీరు ఇప్పుడు వెళ్ళగలరనుకుంటె రిక్షా తెప్పిస్తానన్నారు. అలాగే అంటూ లేచాను. నా ప్రక్కబల్లపై ఎవరికో తలకు డ్రస్సింగ్ చేస్తున్నారు. ఇంతలో రిక్షా వచ్చింది. రూమ్‌నుండి బయటకు వస్తూ చూసాను, చాలామంది నాతో ప్రయాణము చేసినవారు గాయాలతో బాధపడుతున్నారు. ఆ రోజు ఆదివారము అగుటవలన క్యాజుయాలిటి కిటకిటలాడుతుంది. రిక్షాలో అతి కష్టముమీద నా రూమ్ చేరాను.

అప్పుడే మొఖము కడుగుకొని వచ్చిన నా రూమ్ మేట్ నన్ను చూసి ఆశ్చర్యపోయాడు.

"ఇదేంటి ఈ కట్లు మీ రన్నవరం వెళ్ళలేదా?" అన్నాడు.

యాక్సిడెంట్ సంగతంతా చెప్పాను. మందుల చీటి ఇచ్చి మందులు తెప్పించాను. ఆ రోజంతా పరామర్శించేందుకు చాలామంది వచ్చారు. వచ్చిన ప్రతీ వారికి యాక్సిడెంట్ సంగతి చెప్పలేక మా రూమ్‌మేట్ చేత చెప్పించేవాడిని. ఆరోజు కాస్త జ్వరము వచ్చినట్లుంటే రొట్టె పాలు తీసుకొని మందు వేసుకొని ప్రక్కపై వాలేను. అప్పుడే చిత్రసీమ రికార్డులు వస్తున్నట్లున్నాయి. [illegible]లో "ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరు" పాట విన్పిస్తుండగా నిద్రలోకి జారిపోయాను.

• • •

మరునాడు ఉదయము లేస్తుండగానే ఒళ్ళంతా నొప్పులుగా ఉంది. కుడికాలు, భారంముగా తోచింది. రూము మేటును పిలిచాను. కానీ పిలుపుకూడా భారముగానే వచ్చింది. మాటలు త్వరగా రావడములేదు. నెమ్మదిగా బరువుగా వచ్చాయి. కాస్తంత నత్తికూడా వున్నది. రూమ్ మేటుతో చెప్పాను. ఒళ్ళంతా బాధగా జ్వరముగా వుందని వెంటనే వేడినీళ్ళతో నొప్పిగా వున్న చోట కాపి, మందు తనే స్వయముగా వ్రాసి మాత్రలు మింగమన్నాడు. తనూ కాలేజికి వెళుతూ నాకు పెన్సిలిన్ ఇంజక్షన్ ఇచ్చి పాలు ఫలహారము రూముకి వచ్చేటట్టు ఏర్పాటు చేశాడు. ఆ రోజు సాయంత్రము నా రూమ్ మేట్ రూమ్‌లోకి వస్తూనే నాకు పేపరు చూపించాడు. అందులో యాక్సిడెంట్ గురించి వేశారు. చేబ్రోలు ప్రాంతంలో బస్సు చెట్టును ఢీకొనుట వలన పలువురికి గాయాలు, డ్రైవరు మృతి" పాపం డ్రైవరనుస్మరించాను మనస్సులో.

కొన్నిరోజులు ప్రక్కమీదనే గడిపాను. రూమ్‌మేటు ఏమి కావాలన్నా దగ్గరుండి చూసేవాడు.

భారతికి నేను బస్సు యాక్సిడెంటులో గాయపడ్డానని తెలిస్తే ఎంత బాధపడుతుందో అని వూహించుకొంటుంటగా—

"ఏమిటి రూమ్‌మేట్! నా యెదురుగుండా రూములోకి వచ్చిన ఇవాళ పలకలేదు. ఏదో పరధ్యానంగావున్నావు. ఇంటిమీదవున్నగాని మనస్సు మళ్ళిందా ఏమిటి" అని నా రూమ్‌మేట్ పలకరించేసరికి ఈలోకములోకి వచ్చేవాడిని. నా ఆలోచనలను నాలో నేను సిగ్గుపడేవాడిని. నాలో తపన ప్రారంభమయ్యేది. ఎంత వేగంగా కలుసుకొని భారతిని చూస్తానా అని. అలాగే నిద్రలోకి జారిపోయే వాడిని. ఇటువంటి ఆలోచనలతో నాలుగురోజులు గడిచి పోయాయి.

ఐదవరోజున నడిచేందుకు ప్రయత్నించాను. కాని వడక వుంటుతున్నట్లుగా వుంది. నా వుంటితనము చూసి నేనంటే కిట్టని రాఘవరావులాంటి వాళ్ళు మరింక నా కాలు నయం కాదని దుష్ప్రచారం చేశారు. ఆ మాటలు విన్న నేను మరింత క్రుంగిపోయాను. ఈ విషయం భారతి వరకు వెళ్ళకుండా వుండాలని దేవుని మనస్ఫూర్తిగా ప్రార్థించాను. కానీ నా ఆశ నిరాశే అవుతుందనుకో లేదు.

* * *

"గుడ్‌మార్నింగ్ ప్రభాకర్ అన్నాడు నా రూమ్ మేట్.

"గు...గు ...గుడ్ ... మా... మా... మార్నింగ్" అన్నాను బలవంతంగా.

"అదేమిటి ఇంకా నిద్రమత్తా, లేక నోరు పెగలడము లేదా, అవునుగాని రాత్రి. భార ', భారతి అంటూ కలవరించావు. ఎవరు బ్రదర్? ఏమిటి కథ?"

ఏదో చెప్పాలని తపన, ఏమీ చెప్పలేక పోతున్నా నన్న బాధ. ఎంతో ప్రయత్నము మీదగాని మాటలు సరిగ్గా పలకలేక పోతున్నాను. బాగా నత్తిగా వస్తున్నాయి నా మాటలు దవడలతో బాధ విపరీతముగా కాసాగింది.

నా బాధ గమనించి పట్టున్నాడు. నా రూమ్‌మేటు వెంటనే హాస్పిటల్‌కు తీసుక వెళ్ళాడు. డాక్టర్లు నన్ను పరీక్షించి ఏమి పరవాలేదు కట్టిప్పిన తరువాత సర్దుకుంటుందన్నారు. కట్లు వేసిన దగ్గరనుండి ఎనిమిదవరోజు రాగానో రమ్మన్నారు, ఇంజక్షను వరుస తప్పకుండా తీసుకోమని చెప్పి పంపించేశారు.

సరిగ్గా ఎనిమిదవ రోజు నా రూమ్‌మేటుతో కలిసి కాస్త కుంటుతూ హాస్పిటల్ లోనికి వెళ్ళాను. హాస్పిటల్ థియేటర్ దగ్గరకు వెళుతుంటే నా భారతి కన్పించింది. అబ్బ ఎన్నాళ్ళకు అనుకొన్నాను. నా వైపుకే నడుస్తు రాఘవరావు ఏదో అడుగుతున్నాడు, భారతి సమాధానం చెబుతున్నట్లున్నది. వాళ్లు రాను రాను నా దగ్గరకు వచ్చారు. అప్పుడు చూసింది నన్ను చటుక్కున రాఘవ రావుతో మాట్లాడుతున్నదల్లా మానివేసి నా ప్రక్క జాలిగా చూసింది. నా దగ్గరగ వచ్చి పలకరిస్తుందని ఆశించాను. తనతో ఏదో మాట్లాడాలన్పించింది. కానీ నా నత్తితోపాటు నా నోరు పెగలలేదు. ఇంతలో బుర్ర దించుకొని వెళ్ళిపోయింది. దానితోపాటు రాఘవరావు వికటాట్టహాసం చేస్తున్న నవ్వు నా మనస్సును చెదర గొట్టింది.

నా రూమ్‌మేటు సాయంతో ఆపరేషన్ థియేటర్‌లో అడుగు పెట్టాను.

మా వార్డు చీఫ్‌కి ఆరోజు ఆపరేషన్ డ్యూటీ. ఆయనే నా కట్లిప్పారు. బాగా కూడుకుపోయింది గడ్డం దగ్గర గాయం.

"నీవు చాలా అదృష్టవంతుడివి. అటువంటి యాక్సిడెంట్ నుండి బయటపడినందు" అన్నారు మా చీఫ్.

నేను నా నత్తిని గురించి, బాధ గురించి చెప్పాను.

"పరవాలేదు, త్వరలో తగ్గిపోతుంది. రోజూ క్రింది దవడను ఎత్తుతు, దించుతు ఎక్సర్‌సైజు చేయుమన్నారు."

కొద్దిరోజులు పోయాక బాగానే కోలుకొన్నాను. కానీ కాస్త నత్తిమాత్రముంది. ఇంకా కుంటుతూనే వున్నా, నా అంతట నేను నడవగల పరిస్థితికి వచ్చాను. కానీ నా ఎడమకంటినుండి నీరు విపరీతముగా కార సాగింది. ఆ కంటితో ఏమి చూసినా మసగ్గా కనిపించేవి. ఒకరోజు హాస్పిటల్‌కు వెళ్ళి ఆప్తమాలజీ డిపార్ట్ మెంటులో చూపించేను. వెంటనే ఒక అయింట్

మెంట్ ఇచ్చేరు. అది ఇరవై నాలుగు గంటలు కంటికి పెట్టాలన్నారు. కంటిలో వెలుగు పడకుండా నల్ల గుడ్డ కట్టమన్నారు. అలానే చేసేను. ఎడమ కంటికి నల్ల గుడ్డ కట్టేను.

కాలేజీ మానేసి హాస్టల్‌లోనే వుంటున్నా నాకు లెసన్స్ పోతున్నాయన్న బాధ కలుగ నారంభించింది. ఈ యాక్సిడెంట్ మూలంగా ఇప్పటికే ఇరవయి రోజులు వృధా అయ్యింది. ఇలా రెస్టు తీసుకుంటే మరో నెల పట్టవచ్చు. ఎటెన్‌డెన్స్ పూర్‌గ వుంటే నన్ను పరీక్షకు వెళ్ళకుండా డిటైన్ చేయకుండా మానరు. ఎలాగన్నా రేపటినుంచి కాలేజికి వెళ్ళిపోవాలన్న ఆతురత నాలో కల్గింది.

♦ ♦ ♦

ఆరోజు కాస్త కుంటుతున్నా, ఎడమ కంటిపై కట్టిన నల్లగుడ్డ పైకి కన్పించకుండ 'కూలింగ్ గ్లాసెస్' పెట్టి హాస్పిటల్‌కు వెళ్ళేను. ఆ రోజు వార్డ్సు 'చీఫ్' వెనుక వెనుక అన్ని బెడ్స్‌కు, అందరితో పాటు నేను వెళ్లుతున్నాను. ఒక బెడ్ దగ్గర కొచ్చేసరికి నా కాళ్లు కదల లేదు. ఆ బెడ్ మీద ఉన్న పేషంట్, ఆరోజు బస్సులో నన్ను పేపరడిగిన మాష్టారు. పాపం కండిషన్ సీరియస్‌గా వుంది. ఆయన నన్ను గుర్తు పట్టినట్టు లేదు అందరిప్రక్క చూసినట్లే నాప్రక్క చూసారు. చీఫ్ ఆయనను పరీక్షించేరు. "పూర్ ఫెలో, వుయ్ విల్ ట్రై అవర్ లెవల్ బెస్ట్" అంటూ ఆ బెడ్ వదలి, ప్రక్క బెడ్ దగ్గరకు వెళ్ళారు. నాకు మాత్రము ఆ బెడ్ దగ్గర నుండి కదల బుద్ధి కాలేదు. ఆయనను పలుకరించాలని వుందికాని నోట మాట రాలేదు.

ఆరోజు భారతి క్లాసుకు వచ్చినా నన్ను పలుకరించ లేదు. ఎట్‌లీస్ట్ గుడ్‌మార్నింగ్ అనికూడా అనలేదు. భారతి నన్ను పలకరించలేదని లోలోపల ఎంతో బాధ పడుతున్నా పైకి ఏదో ద్వేషము...నన్ను పలకరించ లేదని! ఏదో పంతము. అయ్యో, మీకు దెబ్బ తగిలిందా అని అయినా అడగని గర్వబోతును నేనెందుకు పలుక రించాలని ఎంతో కోపము. అందగత్తెనని గర్వపడుతుం దని ఏమిటో ఆవేదన...నా భారతి మారిపోతుందేమో నని. ఏభావము ముఖముపై స్థిరముగ నిలవలేని పరిస్థితులలో ముభావము చోటు చేసుకుంది. ఆరోజంతా ఏదో వెలితిగా గడిచిపోయింది.

రెండు రోజులలో నాకు నత్తి వచ్చిందని అందరికీ తెలిసిపోయింది.

ఒకరోజు వార్డ్సునుండి బయటకు వస్తున్నప్పుడు, ప్రియంవద మరో ఇద్దరమ్మాయిలు నా దగ్గరకొచ్చేరు.

"పాపం! మీరుకూడ యాక్సిడెంట్‌లో చిక్కుకున్నారట" అంది ప్రియంవద.

"అ...అ...అ...అవునండి" అన్నాను. అతి కష్టము మీద వస్తున్న నవ్వు నాపుకున్నారు ముగ్గురు. ప్రియంవద మళ్ళీ అడిగింది. "యాక్సిడెంటెలాగ జరిగిందని?"

అతి కష్టముమీద నత్తితోనే వివరించేను. మధ్యలో నవ్వాపుకోలేక ప్రియంవద బయటకు నవ్వేస్తున్నా నాకు కోపము రాలేదు. తనెంతో జాలిపడుతూ అడుగుతుం దన్న భావం నాలో కలుగుటవలన.

(సశేషం)



"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు ఏమాత్రమూ మేము బాధ్యులము కాదు.

—సంపాదకుడు.